సాక్షి
ప్రకాశం

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023





**కడలూరు బోట్ల సమస్యకు పరిష్కారం**

కడలూరు బోట్ల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని మత్స్యశాఖ జేడీ తెలిపారు.

- 8లో..



**పశువుల బీడును కాపాడండి**

కబ్జాదారుల చెర నుంచి పశువుల బీడును కాపాడాలని మద్రిపూడి గ్రామస్తులు పోలీసులను కోరారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30 /21

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

## న్యూస్‌రీల్

### పీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్యం

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

**ఒంగోలు అర్బన్:** పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధం చేశామని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీల్లోని ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో 64 పీహెచ్‌సీలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 1058 గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు, ఇతర పారామెడికల్ సిబ్బందితో ఎటువంటి కొరత లేకుండా సిద్ధం చేశామన్నారు. అంతేకాకుండా పీహెచ్‌సీలో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. ల్యాబ్ పరీక్షలు చేసేందుకు అవసరమైన అన్ని పరికరాలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్స్ ఉన్నారన్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పీహెచ్‌సీల్లో ప్రతి ఒక్కరూ రోజుకు మూడుసార్లు ముఖహాజరు కావాలన్నారు. దీనిలో డాక్టర్‌లు వాణీశ్రీ, భగీరథ, శ్రీవాణి, సుందర్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు పూర్తిగా అరికట్టాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** జిల్లాలో ఎట్టిపరిస్థితిల్లో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మెటర్నల్ డెత్ సర్వేలెన్స్ రెస్పాన్స్ (ఎండీఎస్ఆర్) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ టీనేజ్‌లో గర్భం దాల్చకుండా అవగాహన కార్యక్రమాలు జిల్లాలో చేపట్టాలన్నారు. మాతృమరణాలు, నవజాత శివువుల మరణాలపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. నవజాత శిశువు మరణించిన ఒక కేసులో తల్లి టీనేజ్‌లో ఉన్నట్లు గుర్తించారు. గర్భధారణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎలిజిబుల్ కపుల్స్ కార్యక్రమంలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా టీనేజర్‌లు గర్భం ధరించకుండా నియంత్రణ పద్ధతులను తెలియచేయాలన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్‌లు ఆ దిశగా సమన్వయంతో పనిచేయాలన్నారు. గర్భిణులు ఎనీమియా బారిన పడకుండా పర్యవేక్షించాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ మూర్తి, డీఐఓ పద్మజ, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌పై హెడ్మాస్టర్‌ను సంప్రదించాలి

**ఒంగోలు:** నేషనల్ మీన్స్ కం మెరిట్ ఉపకార వేతనం ఎవరికైనా బ్యాంకు అకౌంట్‌కు జమకాకపోతే తక్షణమే వారు పాఠశాల హెడ్మాస్టర్‌ను సంప్రదించాలని డీఈవో బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికై ఆయా సంవత్సరాల్లో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ రుసుము సంబంధిత విద్యార్థుల బ్యాంకు ఖాతా నంబరులో జమచేశారన్నారు. ఎవరికైనా సంబంధిత ఉపకార వేతనంవారి బ్యాంకు ఖాతాలో జమకాకపోతే వారు దరఖాస్తులో నమోదుచేసిన బ్యాంకు మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపినట్లు ప్రభుత్వ పరీక్షల కమిషనర్ తెలిపారు. సదరు విద్యార్థులు వారి స్కాలర్‌షిప్, వారి బ్యాంకు ఖాతా నంబర్‌కు జమకాకపోవడానికి గల కారణం కేవలం వారి లాగిన్ ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని, హెడ్మాస్టర్‌ను సంప్రదించి స్టూడెంట్ లాగిన్‌లో అందుకు గల కారణాన్ని తెలుసుకోవాలన్నారు.

### నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

**ఒంగోలు:** జవహర్ నవోదయ ప్రవేశ దరఖాస్తు గడువును ఫిబ్రవరి 8వ తేదీ వరకు పొడిగించినట్లు ఒంగోలు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ కె.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న జరుగుతుందని, ఆసక్తిగలవారు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలన్నారు.

### ఏప్రిల్ 3 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

**ఒంగోలు:** ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహిస్తారని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర విద్యావిధానంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు పరీక్షల షెడ్యూలు విడుదలైందన్నారు. ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని, 10వ తరగతి విద్యార్థులు ఒక్కో సబ్జక్టుకు రూ.150లు చొప్పున, అలాగే ఇంటర్ విద్యార్థులు ఒక్కో సబ్జక్టుకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



నగరంలో పేదల సొంతింటి కలనెరవేర్చే దిశగా చర్యలు వేగవంతం అయ్యాయి. 24 వేల మందికి ఒక్కచోటే ఇళ్లు కట్టి శాటిలైట్ సిటీ నిర్మిస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది..తమ మనుగడకు ముప్పువాటిల్లుతుందని కుట్రపన్ని తెలుగుదేశం పార్టీ నేతలు న్యాయపరమైన చిక్కులు సృష్టించి అడ్డుకున్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు కట్టి ఇవ్వాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. ప్రైవేటు స్థలాలు కొని ఇళ్లు నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. అధికారులు రెండు ప్రాంతాల్లో 400 ఎకరాల స్థలం సేకరించి మార్చి నెలాఖరులోగా పట్టాలు ఇచ్చేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. దీనిని సైతం జీర్ణించుకోలేని పచ్చ దండు అసత్య ప్రచారానికి పూనుకోవడం గమనార్హం.

# వచ్చే నెలలో పట్టాభిషేకం

- ఒంగోలులో 24 వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు వడివడిగా అడుగులు
- వెంగముక్కలపాలెంలో 200 ఎకరాలు, మల్లేశ్వరపురం, అగ్రహారంలో 200 ఎకరాలు
- భూములిచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులు
- ఏడు శాఖల అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు
- ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చే దిశగా బాలినేని అడుగులు
- మరోమారు అక్కసు వెళ్లగక్కుతున్న పచ్చదండు

**ఒంగోలు అర్బన్:** వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేదల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు, అర్హులైన ప్రతి పేదకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇళ్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందచేయాలని సంకల్పించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం ఒంగోలులో ఒకే ప్రాంతంలో 24 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద వెంచర్‌ను యరజర్ల ప్రాంతంలో 800 ఎకరాలతో ప్లాట్లను సిద్ధం చేయించి లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తి చేశారు. ఇంత మంది పేదలకు మేలు జరగడం తద్వారా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బాలినేనికి మంచి పేరు వస్తుందని భావించి కుట్రలకు తెరలేపారు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు దామచర్ల జనార్ధన్. తన అనుచరుడితో కోర్టులో కేసు వేయించి పట్టాల పంపిణీ అడ్డుకున్నారు. దీంతో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. అయినా లబ్ధిదారులకు భరోసా కల్పిస్తూ భరోసా పత్రాలు అందచేశారు. ప్రతిపక్ష నేతలు, పచ్చ మీడియా ఎన్ని కుట్రలు చేసినా ప్రయివేటు స్థలాలను కొనుగోలుచేసైనా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బాలినేని నిర్ణయించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో జిల్లా కేంద్రంలో భూములు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. వెంటనే కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో సమావేశమయ్యారు. 24 వేల మంది లబ్ధిదారులకు ఇంటి నివేశన స్థలాలు ఇచ్చేందుకు భూములు గుర్తించాలని కోరారు. ప్రతిపక్ష నేతల్లో గుబులు ప్రారంభమైంది. దీంతో వారి అనుకూల పచ్చమీడియాలో అసత్య కథనాలకు తెగపడ్డారు. కలెక్టర్ సక్రమమైన నోటిఫికేషన్ ఇవ్వలేదని, రైతులను సంప్రదించకుండానే భూములు సేకరిస్తున్నారని, తద్వారా పలు ప్రాంతాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారంటూ అసత్య ప్రచారానికి తెరతీశారు. అయితే ఆందోళన చెందుతున్న రైతులు ఉండే గ్రామానికి సంబంధించి కలెక్టర్ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం గమనార్హం.

**స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులు**

కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చిన వెంగముక్కపాలెం, మల్లేశ్వరపురం, అగ్రహారాలకు సంబంధించి రైతులతో అధికారులు చర్చలు జరిపారు. అధిక సంఖ్యలో రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. దీంతో వెంగముక్కలపాలెంలో 200 ఎకరాలు, మల్లేశ్వరపురం, అగ్రహారంలో 200 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించారు. ఇళ్ల స్థలాల సేకరణపై బాలినేని ఎప్పటికప్పుడు కలెక్టర్‌తో మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్నారు. అంతేకాకుండా అటు ప్రభుత్వ పెద్దలతో టచ్‌లో ఉంటూ ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన వనరులను సైతం సమకూరుస్తున్నారు. మరో వైపు కలెక్టర్, హౌసింగ్, పంచాయతీరాజ్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, గ్రామీణ నీటి సరఫరా, ఏపీఎస్పీడీసీఎల్ శాఖల అధికారులతో చర్చించి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్లాట్లతో పాటు అక్కడ రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి సచివాలయం ఏర్పాటు చేసేలా ముందస్తు ప్రణాళికలు తయారు చేశారు. మార్చి నెలలో పట్టాలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో వడివడిగా చర్యలు తీసుకున్నారు. బాలినేని సంకల్పంతో జిల్లా కేంద్రంలోని పేదలకు సొంత ఇంటికల నెరవేరనుంది. నివేశన స్థలాల పట్టాలు అన్నీ కుదిరితే మార్చి నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ జరగనుంది.

**మార్చి నెలాఖరుకు ప్లాట్లు ..**



మార్చి నెల చివరికి ప్లాట్లు సిద్ధం చేయాలనే లక్ష్యంతో చర్యలు తీసుకున్నాం. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభపరిణామం. ఇప్పటికి 400 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. మరో 50 ఎకరాలు సేకరించి 24 వేల మందికి పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకుంటాం. అయితే మరో 200 ఎకరాల వరకు ఇస్తామని రైతులు ముందుకు వస్తున్నారు. లే అవుట్‌ల వద్ద మౌలిక వసతులు కల్పించేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నిరంతరం మాట్లాడుతూ తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. భూముల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తున్నారు.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

# సంక్షేమ బాంధవుడు సీఎం వైఎస్ జగన్



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, పక్కన కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి

- దేశంలో ఎవరూ చేపట్టని విధంగా ప్రజా సంకల్ప యాత్ర
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి
- 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

**ఒంగోలు సబర్బన్:** సంక్షేమ బాంధవుడిగా దేశంలోనే పెద్ద ఎత్తున కీర్తి సంపాదించుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఏకైక సంక్షేమ ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. ఒంగోలు నగరంలో మంగళవారం 31వ డివిజన్ పరిధిలో డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయనగర్ కాలనీ, వడ్డెర పాలెంలలో బాలినేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ సుదీర్ఘమైన ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి చరిత్రలో నిలిచిపోయేలా రికార్డు సృష్టించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి చలించిపోయారన్నారు. అందుకే ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చి సంక్షేమ పథకాల సారథిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ దూసుకుపోతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని సంక్షేమ పథకాలు కూడా ఎన్నో చేసుకొని పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత హిల్ సైడ్ బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేశారు. తరువాత పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. గుడి అభివృద్ధి కమిటీ దేవాలయానికి సంబంధించిన అభివృద్ధి పనుల్లో పాలు పంచుకోవాలని బాలినేనికి విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ ఇంజినీర్ కే.మాల్యాద్రి, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం అధ్యక్షుడు గంటా రామానాయుడు, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జ్యోత్స్న ముడి రమాదేవి, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు మువ్వా స్వాతి, కార్పొరేటర్లు ఈదర చిన్నారి, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, చింతపల్లి గోపీచంద్, చల్లా తిరుమల రావు, ఎందేటి కోటేశ్వరమ్మ, గండు ధనలక్ష్మి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, ఆర్.హైమావతి, చింతగుంట్ల సువర్ణ, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన రెడ్డి, గోమోదుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, దేవరపల్లి అంజిరెడ్డి, గోలి తిరుపతి రావు, రావులపల్లి నాగేశ్వరరావు, జే.పున్నయ్య, తోటపల్లి సోమశేఖర్, తన్నీరు ఆంజనేయులు, దామరాజు క్రాంతికుమార్, 31వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు జి.స్వరూప్, మిదసల మధు బాబు, గుంజి ఏడుకొండలు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లికార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రమాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్

SPL
SAKSHI PREMIER LEAGUE

**నేటి మ్యాచ్‌ల వివరాలు**

1. పేస్ ఇంజనీరింగ్ కాలేజీ- క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ
2. ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ- శ్రీహర్షిణి డిగ్రీ కాలేజ
3. చీరాల ఇంజనీరింగ్ కాలేజీ- రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ

**ఒంగోలు:** 'సాక్షి' ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) నాలుగో సీజన్ క్రికెట్ లీగ్ పోటీలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు సాక్షి ఒంగోలు బ్రాంచి మేనేజర్ శివన్నారాయణ తెలిపారు. ఏపీఎండీసీ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల సౌజన్యంతో సాక్షి మీడియా ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఒంగోలులోని డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ బాలుర, సీనియర్ పురుషుల పోటీలను బుధవారం ఉదయం 9 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారన్నారు. నిర్విరామంగా జరిగే ఈ పోటీల్లో 4 జూనియర్, 11 సీనియర్ జట్లు తలపడతాయని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా తరఫున రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

# గ్రామ స్వరాజ్యమే జగనన్న లక్ష్యం

- ప్రతి గ్రామంలో ఆధునిక దేవాలయాలు
- టీడీపీ ప్రభుత్వ కాలంలో దోచుకోవడం, దాచుకోవడమే పని
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

**యర్రపల్లి (యర్రగొండపాలెం):** మహాత్మ గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లలచెరువు మండలంలోని యర్రపల్లిలో మంగళవారం ఆయన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లాలన్న బృహత్తర ఆలోచన చేసిన సీఎం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి అన్ని శాఖలకు చెందిన సిబ్బందిని నియమించారని, దీనివలన ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అన్నారు. పాలన వ్యవస్థను ఇంకా ప్రజల ముంగిటకు తీసుకెళ్లేందుకు వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువచేయటానికి గృహసారథులను నియమిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల కాలంలో జగనన్న రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రతి గ్రామంలో ఆధునిక దేవాలయాలు నిర్మించి ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. పూర్తిగా వెనకబడిన పుల్లలచెరువు మండలంలోని యర్రపల్లిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారని, అటువంటి అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్న విషయాన్ని ప్రజలు మరచిపోకూడదని అన్నారు. గత టీడీపీ హయాంలో యర్రపల్లి పంచాయతీ పరిధిలో కేవలం 5 గృహాలను మాత్రమే మంజూరు చేసిందని, వాటిలో రెండు గృహాలకు ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదని, ఇటువంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామంలోని అర్హులైన 90 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలో గృహాలు మంజూరు చేశారని అన్నారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలు గత ప్రభుత్వ కాలంలో చేపట్టే అవకాశం ఉన్నా తాము దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకొని ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని ఆయన విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు బటన్‌నొక్కి నేరుగా తమ అకౌంట్‌లలో నగదు జమ చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు విమర్శలకు దిగుతున్నారని, తమ పాలన కాలంలో ఎందుకు నగదు బదిలీ చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు. అందుకు వారికి మనస్సురాలేదని, పేద ప్రజలకు సహాయం చేయాలన్న ఆలోచనే వారికి లేదని వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.వి.సుబ్బారెడ్డి, సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మీనరసమ్మ సుబ్బారావు, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ డీఈఈలు బి.రామకృష్ణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ తాళిబొట్లను చూపుతున్న అర్చకులు

**మార్కాపురం:** భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి కల్యాణం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ఉభయ దేవేరులతో కలిసి స్వామివారి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ప్రతిష్ఠించారు. బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. వందలాది భక్తుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజీ నరసింహం, కోశాధికారి ఉటుకూరి రామకృష్ణ, ఆర్.శ్రీనివాసులు, వైఎస్ఆర్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషగిరిరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

# అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

**ఒంగోలు అర్బన్:** గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు వెంటనే అనుమతి తీసుకుని చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనుమతులు పొందిన నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రారంభించిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై ఫొటోలను ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌కు పంపాలన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి వివాహాన్ని మహిళా పోలీసులు తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని స్పష్టం చేశారు. జగనన్న తోడు పతకంలో మంజూరైన రుణాలను లబ్ధిదారులకు జాప్యం లేకుండా అందించాలన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. 18 నుంచి 35ఏళ్ల లోపు నిరుద్యోగ యువతను గుర్తించేందుకు యూత్ సర్వేను ఫిబ్రవరి 4వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీపీవో నారాయణ రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ విజయ భాస్కర్, పశు సంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యుత్‌ ఉద్యోగి రాసలీలలు!

● సోషల్‌ మీడియాలో వైరల్‌

**మార్కాపురం:** మార్కాపురం పట్టణ విద్యుత్‌ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రాసలీలల వీడియో సోషల్‌ మీడియాలో హల్‌చల్‌ చేస్తోంది. రెండేళ్ల క్రితం మార్కాపురానికి బదిలీపై వచ్చిన ఆ ఉద్యోగి అవినీతి విషయం ఇప్పటికే అధికారుల దృష్టికి వెళ్లింది. తాజాగా రాసలీలల వీడియో బయటకి రావడం చర్చనీయంశమైంది. గత రెండు రోజుల నుంచి ఈ వీడియో పలు వాట్సాప్‌ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. ప్రతి పనికి ఒక రేటు పెట్టి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌ లైన్ల ఏర్పాటులో రైతులు, వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో ఇటీవలే ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే ఆయన రాసలీలపై మరో వీడియో బయటకు రావడం ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయంశమైంది.

### దివ్యాంగుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



ఎస్పీ మలికా గర్గ్‌కు వినతి పత్రం అందజేస్తున్న అర్చన

**ఒంగోలు టౌన్‌:** దివ్యాంగుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన ఎస్పీ మలికా గర్గ్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల జిల్లాలో మానసిక దివ్యాంగ మహిళలు, బాలికల మీద వరుసగా జరుగుతున్న అకృత్యాలపై కలెక్టర్‌ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేశారు. దివ్యాంగుల మీద దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి మీద నాన్‌ బెయిలబుల్‌ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలని కోరారు. దివ్యాంగుల సంరక్షణ చట్టం -2016 గురించి జిల్లాలోని పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా దివ్యాంగులకు తగిన రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

### మరణించిన ఏఎస్‌ఐ కుమారుడికి ఉద్యోగం

**ఒంగోలు టౌన్‌:** కొనకనమిట్ల పోలీసుస్టేషన్‌ పరిధిలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ గతేడాది ఆగస్టులో అనారోగ్యంతో మృతి చెందిన ఎం.చంద్రశేఖరరాజు కుమారుడు హేమంత్‌ రాజుకు జిల్లా పోలీసు కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగ నియామక పత్రాన్ని ఎస్పీ మలికా గర్గ్‌ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవాలని, పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో నైపుణ్యం పెంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని హేమంత్‌రాజుకు సూచించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సులోచన పాల్గొన్నారు.

### ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్టు




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌

**వేటపాలెం:** మండల పరిధిలో ఇద్దరు నకిలీ పోలీసులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై జి. సురేష్‌ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమ వేశంలో వివరాలు వెల్లడించారు. చల్లారెడ్డి పాలెం పంచాయతీలోని రిక్షాల కాలనీకి చెందిన నక్క రమణా రెడ్డి, కొత్తయానాది సంఘానికి చెందిన చలమచర్ల రాంబాబు, చీరాల వాడరేవుకి చెందిన దర్గారావు నకిలీ పోలీసుల అవతారమెత్తారు. వీరు పోలీసు దుస్తులు ధరించి వేటపాలెం బైపాస్‌ రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాలు ఆపి వాహన చోదకులను బెదిరించి వారి వద్ద నుంచి నగదు, సెల్‌ ఫోన్‌ల బలవంతంగా తీసుకోవడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 25న బైపాస్‌లో బైక్‌పై వెళుతున్న చినగంజాం గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకటరావును ఆపి అతని వద్ద రూ. 700 నగదు బలవతంగా లాక్కున్నారు. వీరిపై అనుమానం వచ్చిన వెంకటరావు వేటపాలెం పోలీస్‌ స్టేషన్‌ ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించారు. నిందితులు కొంత కాలంగా రాత్రి వేళల్లో బైపాస్‌రోడ్డులో వాహన చోదకులు వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడు తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో రమణారెడ్డి గతంలో కూడా అనేక నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. నక్కారమణా రెడ్డితో పాటు చలమచర్ల రాంబాబుని రిక్షాల కాలనీలో మంగళవారం అరెస్టు చేసి, బుల్లెట్‌ మోటార్‌ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ముద్దాయి దుర్గారావు పరారీలో ఉన్నాడు. వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రైవేట్‌ విద్యా సంస్థలకు భరోసా



మాట్లాడుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థులు చంద్రశేఖరరెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి



హాజరైన ప్రైవేట్‌ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు

● శాసనమండలిలో మన గళాన్ని వినిపిద్దాం.. మంచి వారిని ఎన్నుకుందాం
● వైఎస్సార్‌సీపీ యువ నాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి

**ఒంగోలు:** ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్‌ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక సాయి ఐటీఏ ఫంక్షన్‌ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో పంపిణీ చేయనున్న ఇళ్ల పట్టాల్లో ప్రైవేట్‌ విద్యాసంస్థల సిబ్బందికి కూడా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌ సీపీ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న శ్యాంప్రసాద్‌ రెడ్డి విజయానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంచి మనసున్న ఈ ఇద్దరిని రాజకీయ నేపథ్యంతో కాకుండా వారు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేశారని చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. తాను లెక్చరర్‌గా పనిచేశానని, రెడ్‌ క్రాస్‌ చైర్మన్‌గా విస్తృతంగా సేవలందించానని తెలిపారు. నెల్లూరులో కృష్ణ చైతన్య విద్యాసంస్థలు నిర్వహిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానన్నారు. ప్రైవేట్‌ విద్యాసంస్థల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారని వారికి ఓటు కల్పించాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున పోరాటం చేశామన్నారు. 1450 విద్యా సంస్థల్లో అర్హులైన ఓటర్లను ఎన్‌రోల్‌ చేయించినట్లు తెలిపారు. ప్రైవేట్‌ ఉపాధ్యాయులకు గుర్తింపు దక్కకూడదన్న ఉద్దేశంతో కొందరు కోర్టును ఆశ్రయించారని, వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం న్యాయం వైపే ఉంటుందన్నారు. మొట్టమొదటిసారిగా ప్రైవేట్‌ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు ఓటు హక్కు వేసేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞత చాటుకోవడంతోపాటు సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానని హామీ ఇచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను సేంద్రియ వ్యవసాయం చేస్తూనే, చారిటబుల్‌ ట్రస్టు నడుపుతున్నానని పేర్కొన్నారు. జంతువులపై ఉన్న ప్రేమతో 150కి పైగా ఆవులను పోషిస్తున్నానన్నారు. తొలిసారిగా ఆరు జిల్లాల్లో 3.95 లక్షల మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదుచేసుకున్నారన్నారు. ఒక్క ఒంగోలు నియోజకవర్గం నుంచే 22,785 మంది ఉన్నారన్నారు. ప్రైవేట్‌ పాఠశాలల యాజమాన్యాల గుర్తింపు ప్రస్తుతం మూడేళ్లు మాత్రమే ఉందని, దాని పొడిగింపునకు సంబంధించి ప్రస్తుతం ఫైల్‌ నడుస్తోందన్నారు. ఫైర్‌ సర్టిఫికెట్‌కు సంబంధించి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లోపే మంజూరు చేసేలా ఫిబ్రవరిలో మార్పులు రానున్నాయన్నారు.

ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఏపీ టీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత పి.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థల తరఫున తొలిసారిగా గళం విప్పేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్న ఇరువురికీ అండగా ఉంటామన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల సమస్యలైన ఇళ్లపట్టాలు, హెల్త్‌కార్డులు వంటి వాటి పరిష్కారానికి తాను వారధిగా ఉంటానన్నారు. కార్యక్రమంలో డ్రీమ్స్‌ ఆదిలక్ష్మి, అపెక్స్‌ శివకోటిరెడ్డి, జాహ్నవి జనార్దన్‌, వైఎస్సార్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.జాలిరెడ్డి, సరస్వతి విద్యాసంస్థల చైర్మన్‌ రమణారెడ్డి, అపుస్మా జిల్లా కార్యదర్శి మాధవరావు, ప్రొఫెసర్‌ పీహెచ్‌జీ కృష్ణంరాజు, భట్రాజు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సీహెచ్‌ రాజు, రిటైర్డ్‌ ఉపాధ్యాయ సంఘ నాయకులు నరసింహారెడ్డి, సాయి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● అందమైన పుంజు!



**కొమరోలు:** ఆలిండియా చిలకముక్కు కోళ్ల అందాల పోటీల్లో కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కోడి పుంజు 4వ స్థానంలో నిలిచింది. గ్రామానికి చెందిన కోళ్ల పెంపకందారుడు సయ్యద్‌ బాషా తన కోళ్లతో సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించిన కోళ్ల అందాల పోటీల్లో పాల్గొన్నారు. తన కోడికి బహుమతి దక్కడంపై బాషా ఆనందం వ్యక్తం చేశారు.

### కందుకూరు డీవైఈఓ గుండెపోటుతో మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్‌)

**కొండపి:** కందుకూరు డీవైఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వెంకటేశ్వర్లు(59) సోమవారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబంతో కలిసి కొండపిలో నివాసం ఉంటున్న ఆయన అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేట్‌ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు కందుకూరు డీవైఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మద్దిపూడి మండలం తంగెళ్ల హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య మంజులాదేవితోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్‌ చేస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన పల్నాడు జిల్లా ముప్పాళ్ల గ్రామం తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు ముప్పాళ్ల వెళ్లి నివాళులర్పించారు. మూడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయుడిగా, ఎంఈఓగా, డీవైఈఓగా వెంకటేశ్వర్లు సేవలందించారు.

# పశువుల బీడును కాపాడాలి



పశువుల బీడును కాపాడాలని రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న ఇనుకొల్లు పిచ్చిరెడ్డి



బ్రోకర్లకు హెచ్చరిస్తున్న ఎస్సై పి.అంకమ్మరావు

● రెవెన్యూ అధికారుల సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు
● బ్రోకర్ల అత్యుత్సాహంతో మేత భూమిలో ఘర్షణ
● పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

**మద్దిపూడి:** కబ్జాదారుల నుంచి పశువుల మేత పోరంబోకు భూమిని కాపాడాలని అధికారులను మద్దిపూడి పంచాయతీ పరిధిలోని పశుపోషకులు వేడుకున్నారు. హక్కుదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే నంబరు 991-1లోని(పశువుల మేతకు వదులుకున్న భూమి) 329 ఎకరాల భూమిని ఎలా సర్వే చే స్తారని రెవెన్యూ సిబ్బందిని పశుపోషకులు నిలదీశారు. మద్దిపూడి పంచాయతీకి చెందిన కొందరు పశుపోషకులు భూ సర్వేను అడ్డుకున్నారు. ఈ సమయంలో కొందరు బ్రోకర్లు రెవెన్యూ సిబ్బందికి, పోలీసులకు సలహాలిస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో పశుపోషకులు, బ్రోకర్లకు మధ్య వాగ్వివాదం జరిగి గొడవకు దారితీసింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. సర్వే చేసే ముందు ఎందుకు పోలీసులకు సమాచారం ఇవ్వలేదని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించడంతో సర్వేయర్‌ బ్రహ్మయ్య, వీఆర్‌ఓ సామేలు నీళ్లు నమిలారు.

**ఇదీ విషయం**

పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండ సమీపంలో సర్వే నంబరు 991-1లో 329 ఎకరాల భూమి ఉంది. పశువుల మేత కోసం వెంకటగిరి రాజావారి హయాంలో మద్దిపూడి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన 57 మందికి ఒక్కొక్కరి పేరున 5.75 ఎకరాల భూమి కేటాయించారు. రేగలగడ్డ, మద్దిపూడి, గంగపాలెం, రాజుపాలెం, తిప్పలదేవపల్లి తదితర గ్రామాలకు చెందిన పశుపోషకులు ఈ 329 ఎకరాలల్లో పశువులను మేపుకొంటున్నారు. అయితే ఈ భూమి ఎఫ్‌ఎల్‌ఆర్‌లో పేర్లు దఖలు పరిచిన రైతులు ఎవరూ జీవించి లేరు. ఇదే అదనుగా భావించిన కొందరు బ్రోకర్లు పదేళ్ల క్రితం 57 మంది పేర్లకు వీరే వారసులు అని ఒక్కో భాగానికి వచ్చే 5.75 ఎకరాల భూమిని ఇద్దరు లేదా ముగ్గురితో నకిలీ రిజిస్ట్రేషన్‌ చేయించారు. సర్వే నంబర్‌ 991-1లో 329.27 ఎకరాలు ఉండగా దాదాపు 550 ఎకరాలకు రిజిస్ట్రేషన్‌ చేయడం గమనార్హం. రిజిస్ట్రేషన్‌ చేయించుకున్న వారిలో కొందరు మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి సర్వే కోసం పొలంలోకి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న మద్దిపూడి పశుపోషకులు సంఘటన స్థలానికి చేరుకుని అసలైన వారసులను గుర్తించిన అనంతరమే సర్వే చేయాలంటూ అడ్డుకున్నారు. 1970 దశకంలో దర్శి జూనియర్‌ సివిల్‌ కోర్టులో కేసు నడిచిందని, ఉమ్మడి పశువుల బీడుగానే భూమిని ఉంచాలని కోర్టు ఆదేశించిందని గ్రామస్తులు గుర్తు చేశారు. కొందరు బ్రోకర్లు పశువుల బీడు భూమి అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఈ భూమిని అన్యాక్రాంతం కాకుండా హక్కుదారులమైన తమకే భూమిపై శాశ్వత హక్కు కల్పించాలని మద్దిపూడికి చెందిన ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, చుండి లక్ష్మీనరసింహారావు, శ్రీకంఠం భవానీ మరి కొందరు రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, ఐ.మాదిరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సూరే రాఘవరెడ్డి, చేరెడ్డి పెద్దిరెడ్డి ఉన్నారు.

## కడలూరు బోట్ల సమస్యకు త్వరలో పరిష్కారం

● మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి

**సింగరాయకొండ:** సముద్ర తీరప్రాంత చట్టాలకు విరుద్ధంగా జిల్లాలోని తీరానికి 8 నాటికల్‌ మైళ్లలోపు తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనా బోట్లు చేపల వేట సాగిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సోనా బోట్లతో విచ్చలవిడిగా చేపలు వేటాడటం వల్ల జిల్లాలోని మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. కడలూరు బోట్ల కారణంగా జిల్లా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటీవల కొత్తపట్నం, పాకల సముద్ర తీర సమీపానికి వచ్చిన సోనాబోట్లను మెరైన్‌ పోలీసులు, మత్స్యకారుల సహకారంతో తరిమికొట్టగలిగామన్నారు. కానీ ఈనెల 28వ తేదీ శనివారం మళ్లీ ఊళ్లపాలెం తీరానికి కడలూరు బోట్లు వచ్చాయన్నారు. దీనిపై శాశ్వత పరిష్కారం కోసం తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, మత్స్యశాఖ కమిషనర్‌కు రాతపూర్వకంగా సమాచారం అందించామని, వారు వెంటనే స్పందించారన్నారు. గతంలో ఎన్నో సార్లు ఈ సమస్యను తమిళనాడు రాష్ట్ర అధికారులకు తెలిపినా వారు స్పందించలేదని, ఈసారి వెంటనే స్పందించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు సమావేశమై సమస్యను పరిష్కరించుకుందామని సమాచారం అందించారన్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, మత్స్యశాఖ కమిషనర్లు వర్చువల్‌గా సమావేశమయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశం జరిగితే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఈఓఆర్డీ ఎం అంజలీదేవి ఉన్నారు.

## జాతీయ ఫుట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌కు హరిప్రియ



హరిప్రియ

**ఒంగోలు టౌన్‌:** ఒంగోలు ఆంధ్రకేసరి విద్యాకేంద్రానికి చెందిన విద్యార్థిని పి.హరిప్రియ జాతీయ స్థాయి ఫుట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ వాకా వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు తిరుపతిలోని వెంకటేశ్వర ఆర్ట్స్‌ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 66వ స్టేట్‌ అండర్‌-19 చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన హరిప్రియ.. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని వివరించారు. ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ జ్యోత్స్నాదేవి, పీడీ ఆర్‌.హరిరామ జోగయ్య, కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు హరిప్రియను అభినందించారు.

## లారీని ఢీకొట్టిన ట్రావెల్స్‌ బస్సు



ప్రమాదానికి గురయిన ట్రావెల్స్‌ బస్సు

**ఉలవపాడు:** లారీని వెనుక నుంచి ట్రావెల్స్‌ బస్సు ఢీకొన్న సంఘటన మండల పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై కరేడు ర్యాంపు సమీపంలో మంగళవారం తెల్లవారుఝామున జరిగింది. వివరాలు... విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న శ్రీ వెంకటేశ్వర ట్రావెల్స్‌ బస్సు 30 మంది ప్రయాణికులతో వెళ్తోంది. ముందు వెళుతున్న వాహనం బ్రేక్‌ వేయడంతో వెనుక వైపు ఢీకొట్టింది. బస్‌ ముందు భాగం దెబ్బతినింది. డ్రైవర్‌ నరేష్‌ తో సహా ప్రయాణీకులంతా క్షేమంగా బయటపడ్డారు. మరో వాహనం వచ్చేవరకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అదే ట్రావెల్స్‌ కు చెందిన మరో బస్‌లో ప్రయాణికులను తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్‌ఎంపీ ప్రైవేట్‌ వైద్యశాల సీజ్‌



వైద్యశాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్‌, వైద్యాధికారి

**దొనకొండ:** మండలంలోని చందవరం గ్రామంలో అనుమతి లేకుండా ఓ ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న ప్రైవేట్‌ వైద్యశాలను తహసీల్దార్‌ కాలే వెంకటేశ్వరరావు, వైద్యాధికారి ఎం.సునీత మంగళవారం సీజ్‌ చేశారు. అధికారుల కథనం మేరకు వివరాలు.. చందవరం గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు శివారెడ్డి కొన్నేళ్ల నుంచి ప్రైవేట్‌ వైద్యశాల నడుపుతున్నారు. అనుమతి పత్రాలున్నాయని గ్రామంలో అందరికీ చెబుతూ వైద్యశాల కొనసాగిస్తున్నారు. ఇటీవల డెలీవరీ చేసి ఓ మహిళ ప్రాణానికి ముప్పు తెచ్చారు. రామిరెడ్డిపల్లెకు చెందిన రామిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి వైద్యం కోసం వెళ్లగా ప్రథమ చికిత్స చేసి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్‌ వైద్యశాలకు సిఫార్సు చేశారు. సుబ్బారెడ్డి అక్కడ వైద్యం పొందుతూ మరణించారు. దీంతో మృతుడి కుమారుడు రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. తహసీల్దార్‌ కాలే వెంకటేశ్వరరావు, వైద్యాధికారి ఎం.సునీతకు ఫిర్యాదు చేయడంతో వారు చందవరం వెళ్లి ఆర్‌ఎంపీ వైద్యశాలను, మందులు, పరికరాలను తనిఖీ చేసి సీజ్‌ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు వైద్యశాలను తెరవకూడదని తహసీల్దార్‌ శివారెడ్డి హెచ్చరించారు. వారి వెంట వీఆర్‌ఓ సౌజన్య ఉన్నారు.

## రంగారాయుడు చెరువులో మహిళ ఆత్మహత్య



లక్ష్మీప్రవీణ మృతదేహం

**ఒంగోలు టౌన్‌:** స్థానిక రంగారాయుడు చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌ టౌన్‌ పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన లక్ష్మీ ప్రవీణ(44) రంగారాయుడు చెరువుకు వచ్చింది. చెరువు గట్టుపై ఉన్న సిమెంట్‌ బల్ల మీద కూర్చుని ఎవరితోనో ఫోన్లో మాట్లాడిన ఆమె కాసేపటి తర్వాత చెప్పులు, ఫోన్ను గట్టుమీద పెట్టేసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న వన్‌ టౌన్‌ ఎస్‌ఐ మురళి సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి భర్త గతంలోనే మరణించాడు. కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె చదువుకుంటున్నట్లు సమాచారం. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.